క్లుప్తంగా

సీడీపీవోగా లక్ష్మీదేవి బాధ్యతలు



అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు ప్రాజెక్ట్ సీడీపీవోగా ఎ.లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న విజయలక్ష్మి బదిలీపై ప్రత్తిపాడు సీడీపీవోగా వెళ్లారు. ఆమె స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి సీడీపీవోగా లక్ష్మీదేవి బదిలీపై వచ్చారు. సీడీపీవో లక్ష్మీదేవికి కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

మండల వ్యవసాయాధికారిగా ప్రేమ్‌సాగర్



వేమూరు: మండల వ్యవసాయాధికారిగా ప్రేమ్‌సాగర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ వ్యవసాయాధికారిగా పని చేస్తున్న చందోలు సునీత బదిలీపై వట్టిచెరుకూరు వెళ్లారు. ఆమె స్థానంలో తెనాలి మండల వ్యవసాయాధికారిగా పని చేస్తున్న ప్రేమ్‌సాగర్ బదిలీపై వేమూరు వచ్చారు. గ్రామ వ్యవసాయాధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పాస్టర్లకు బియ్యం పంపిణీ



తెనాలిటౌన్: ఆర్‌ఈఐ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం సేవకులకు బియ్యం పంపిణీ నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని గద్దం థామస్ ప్రాంగణంలో జోషయ, జాషువా జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 150 మంది పాస్టర్లకు ఒక్కొక్కరికి పది కేజీల చొప్పున బియ్యం బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో షారోన్, నతానియేల్, పాస్టర్లు రావూరి విక్టర్‌పాల్, మల్లవరపు విజయ్ కుమార్, గద్దం జాన్‌బాబు, సువర్ణరాజు, షాలేమ్, ఐజాక్, సురేష్ పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిగా సుధీర్‌బాబు




తెనాలిటౌన్: మండల వ్యవసాయాధికారిగా కల్లగుంట సుధీర్‌బాబు నియమితులయ్యారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులోని కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా మార్టూరు నియోజకవర్గం కారంచేడు మండలం నుంచి బదిలీపై తెనాలి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన జి.ప్రేమ్‌సాగర్ బదిలీపై వేమూరు మండలం వెళ్లారు. ఈ సందర్భంగా ఏవో సుధీర్‌బాబు మాట్లాడుతూ మండల పరిధిలో వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది, రైతులను సమన్వయం చేసుకుని రైతు సేవలు ముందుకు వెళ్తామని తెలియజేశారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఏఈవోలు మోహన్, బ్రహ్మం, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తెనాలిటౌన్: పట్టణంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు పట్టణంలో నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాలు వివిధ కేంద్రాల్లో నిరాటకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, నూతన ప్లే గ్రౌండ్స్, సచివాలయ కమ్యూనిటీ హాల్స్, కల్యాణ మండపాలలో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా యోగా శిబిరాలు జరుగుతున్నట్లు వెల్లడించారు.

మొబైల్ బుక్ కీపింగ్ పై అవగాహన



కొల్లిపర: స్వయం సహాయ సంఘాలకు చెందిన ఎటువంటి లావాదేవీలు ఇక నుంచి మొబైల్ బుక్ కీపింగ్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చని ఐబీ డీపీఎం కామేశ్వరి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో స్వయం సహాయ సంఘాలకు మొబైల్ బుక్ కీపింగ్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఐదు గ్రామ సంఘాలు ప్రభుత్వం ఎంపిక చేసి పైలెట్‌గా ఈ యాప్‌ను ఆయా గ్రామాలలోనే స్వయం సహాయ సంఘాలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యాప్ ద్వారా జరుపుతున్న లావాదేవీలు ఎప్పటికప్పుడు ఏ విధంగా పరిశీలించాలి అన్న అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.రమాదేవి, సీసీలు టి.మధు, పూర్ణయ్య నాగుల్ ఖాన్, వెంకటరత్నం, వివో ఎస్.సుధారాణి, స్రవంతి, బసమ్మ, సునీత, స్వాతి, ధర్మతేజ, స్వర్ణభారతి, శ్రీ సాయి, శ్రీ రేణుకా దేవి, శ్రీ రామలింగేశ్వర గ్రామ సంఘాలు పాల్గొన్నారు.

రహదారి మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు

- మలుపుల్లో తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు
- హెచ్చరిక బోర్డులు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్న స్థానికులు



గుడ్డికాయలంక-అక్కిలేరు వద్ద ప్రమాదభరితంగా ఉన్న మలుపు



పమిడిమర్రు మలుపు వద్ద ముళ్ల చెట్లతో కనిపించని హెచ్చరిక బోర్డులు

రేపల్లె : రహదారి మలుపులు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. నియోజకవర్గంలోని పలు రహదారి మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో వాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. పలు రహదారి మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవటం, హెచ్చరిక బోర్డులు ఉన్న చోట్ల ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు బోర్డులను కప్పివేయటంతో ఆదమరచి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారి వెంట దట్టంగా పెరిగిన ముళ్ల చెట్లతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నాయి.

ప్రమాదకరంగా ఉన్న మలుపులు ఇవే

ప్రధానంగా రేపల్లె మండలంలోని రేపల్లె-నెల్లూరు వారిపాలెం వెళ్లే మలుపు అత్యంత ప్రమాదభరితంగా ఉంది. ఈ రహదారి పక్కనే బ్యాంక్ కెనాల్ ఉండటం, కాల్వకు సైడ్‌వాల్స్ లేకపోవటంతో మలుపు వద్ద అదుపు తప్పి పలు సందర్భాలలో వాహనాలు బ్యాంక్ కెనాల్‌లోకి దూసుకెళ్లిన ఘటనలు ఉన్నాయి.

- అదేవిధంగా చాట్రగడ్డ-మైనేనివారిపాలెం రహదారిలో మలుపు, పేటేరు-కారుమూరులో రహదారిలో మలుపు, మోర్లవారిపాలెం-వేజళ్ళవారిపాలెం రహదారిలో మలుపు, గుడ్డికాయలంక-అక్కిలేరు వద్ద మలుపు, సజ్జావారిపాలెం-పమిడిమర్రు వెళ్లే రహదారిలో మలుపు, చిరకాలవారిపాలెం వద్ద మలుపులు అత్యంత ప్రమాదభరితంగా ఉన్నాయి.
- మలుపుల వద్ద రహదారికి ఇరువైపులా దట్టంగా ముళ్ల చెట్లు పెరిగి ఉండటంతో పలు సందర్భాలలో వాహనాలు మలుపు తిప్పే క్రమంలో ముళ్ల చెట్లకు రాసుకుని వాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. రాత్రి సమయంలో ఆయా ప్రదేశాలలో వీధిలైట్లు లేకపోవటంతో మలుపులు కనిపించక మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

గతంలో పలు ప్రమాదాలు

ఈ ప్రమాదకర మలుపుల వద్ద గతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. పేటేరు-కారుమూరు రహదారిలోని ఎస్ కటింగ్ మలుపు వద్ద గతంలో తెనాలి నుంచి రేపల్లెకు వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు బోల్తా కొట్టడంతో పలువురు ప్రయాణికులు గాయాలపాలయ్యారు. అదే విధంగా రేపల్లె నుంచి నగరం వెళ్లే రహదారిలో అక్కిలేరు వద్ద ఉన్న మలుపు వద్ద గతంలో పలు ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాల బారిన పడి పలువురు గాయాలపాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు తొలగించి, వీధిలైట్ల సౌకర్యం ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



డాక్టర్ ఈవూరు గణేష్‌ను సత్కరిస్తున్న రామ్‌గోపాల్

రేపల్లె: ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామానికి చెందిన కేశన రామ్‌గోపాల్, యువజన విభాగం జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమితులైన కనగాల గ్రామానికి చెందిన పేట నాగేశ్వరరావులు శుక్రవారం గుళ్ళపల్లిలోని పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త డాక్టర్ గణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా ప్రజలకు చేసిందేమీలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో నిర్లక్ష్యం చూపుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ఆయా అంశాలపై ప్రజలను చైతన్యం చేసి గత ప్రభుత్వం చేసిన మంచి, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న దగాను వివరించాలని కోరారు. కార్యక్రమంలో చెరుకుపల్లి మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్

డిప్యూటీ ఏఈఈ ఎస్.సురేష్‌బాబు



నూతన 33 కేవీ లైన్ల పనుల ప్రారంభంలో విద్యుత్ అధికారులు

చెరుకుపల్లి: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు నూతన 33 కేవీ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సురేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించేందుకు నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం, మండలాల రైతులు, ప్రజల విన్నపం మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో రూ.కోట్ల వ్యయంతో కావూరు నుంచి నగరం వరకు నూతన 33 కేవీ లైన్లు ఏర్పాటు చేసి విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు చేపట్టామని సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం 33 కేవీ లైను నిర్మాణ పనులను ప్రారంభించి విద్యుత్ స్తంభాలు ఎత్తారు. కార్యక్రమంలో నగరం, చెరుకుపల్లి మండలాల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



పీవీపాలెం మండల యువజన విభాగం అధ్యక్షుడు మౌలాలిని సన్మానిస్తున్న నాయకులు

పార్టీ మైనార్టీ విభాగం నాయకులు అహ్మద్‌హుస్సేన్

బాపట్ల: సంక్షేమం కావాలంటే వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఆ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు షేక్ అహ్మద్‌హుస్సేన్ పేర్కొన్నారు. పార్టీ పీవీపాలెం యువజన విభాగం మండల అధ్యక్షుడిగా ఎంపికైన షేక్ మౌలాలిని శుక్రవారం రాత్రి పార్టీ నాయకులు సన్మానించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారందరికీ మంచి భవిష్యత్ ఉంటుందని అహ్మద్‌హుస్సేన్ అన్నారు. నేడు రాష్ట్ర ప్రజలు సంక్షేమం కోసం ఎదురు చూస్తున్నారని, కూటమి ప్రభుత్వంలో సంక్షేమం లేదు, అభివృద్ధి లేదన్నట్లు ఉందని తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ మున్వీర్, షేక్ బాజీ, అమ్మీర్ ఖాన్, సుమంత్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె : 33 కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రేపల్లె పట్టణం, రూరల్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆ శాఖ డిప్యూటీ ఈఈ డి.శ్యామ్ సుధాకర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేమూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు మండలంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పెరవలిలో మెయింటెనెన్సు పనుల నేపథ్యంలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

చుండూరు(వేమూరు): పెనుగుదురుపాడు గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా పెనుగుదురుపాడు ఫీడర్ పరిధిలోని పెనుగుదురుపాడు, శ్రీరంగపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు దోనేపూడి అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

నేడు 20 గ్రామాల్లో విద్యుత్ నిలిపివేత

కొల్లిపర: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని కొల్లిపర సబ్ స్టేషన్, మున్నంగి సబ్ స్టేషన్, అన్నవరం ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం 20 గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

మట్టి ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

చెరుకుపల్లి: మట్టి ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనటంతో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం రాత్రి రాంబొట్లపాలెం సెంటరులో జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల వివరాల మేరకు రాంబొట్లపాలెం నుంచి చందోలు వైపు ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్ చందోలు వైపు నుంచి సొంత గ్రామం కావూరు వస్తుండగా రాంబొట్లపాలెం రోడ్డు పక్క చెరువు సమీపంలో జాతీయ రహదారిపై అతి వేగంగా ట్రాక్టర్ ఢీకొనటంతో బైక్‌పై వెళుతున్న కావూరు ఎర్రదిబ్బకి చెందిన షేక్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భాషా పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం బాషా ఐసీయూలో చికిత్స పొందుతున్నట్టు బాధితుడి బంధువులు తెలిపారు. ఏది ఏమైనా మండలంలో మట్టి తోలుతున్న ట్రాక్టర్లు, లారీలు సమయపాలన లేకుండా పెద్దగా టేపు రికార్డుల సౌండుతో.. జనం రద్దీగా ఉండే ప్రదేశాల్లో కూడా మితిమీరిన వేగంతో నడపటంతో వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ ఉమేష్, పక్కన ఎస్‌ఐ ఆనంద్

తెనాలిరూరల్: గుంటూరు నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూరల్ సీఐ ఆర్. ఉమేష్ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పట్టణ ఐతానగర్‌కు చెందిన సుకుమార్ మండలంలోని సోమసుందరపాలెంకు చెందిన అలికిపల్లి సాంబిరెడ్డి, కొల్లిపర మండలం తూములూరుకు చెందిన కురగంటి చైతన్య, పెదరావూరుకు చెందిన పగడం మణిసింహారెడ్డి స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు డబ్బుల కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. గుంటూరు కొత్తపేటకు చెందిన వృద్ధుడు రత్తయ్య వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చి పొట్లాలు కట్టి విక్రయిస్తున్నారు. గంజాయి విక్రయాలపై సమాచారం రావడంతో రూరల్ ఎస్‌ఐలు ఆనంద్, శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ చెంగలరాయుడు, కానిస్టేబుళ్లు డి. రవి, సుబ్బారెడ్డి నందివెలుగు ప్రధాన కూడలిలో గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై సాంబిరెడ్డి, చైతన్య, మణిసింహారెడ్డి త్రిపుల్ రైడింగ్ చేస్తూ కనబడ్డారు. వారి వాహనాన్ని తనిఖీ చేయగా 1400 గ్రాముల గంజాయి లభించింది. సుకుమార్‌కు చెందిన బైక్‌లో స్నేహితులందరూ గుంటూరు వెళ్లగా తనకు వేరే పని ఉంది తర్వాత వస్తానంటూ సుకుమార్ అక్కడే ఆగిపోయాడు. నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా రత్తయ్య నుంచి తరచూ కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. సుకుమార్, రత్తయ్య పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ ఆనంద్, సిబ్బంది ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు

తెనాలిటౌన్: పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు ఇన్‌ఛార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. శుక్రవారం పట్టణ కొత్తపేట, గంగానమ్మపేటలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కొత్తపేటలో శానిటేషన్ సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం వార్డులో పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.కాల్వల్లో పీల్ట్ తీయడం వేగవంతం చేయాలని ఎక్కడ అపరిశుభ్రత కనపడకూడదని సూచించారు. అనంతరం గంగానమ్మపేటలో పర్యటించి తడి చెత్త పొడి చెత్త సేకరణను పరిశీలించారు. గృహిణులు రోడ్లపై చెత్త చెదారం వేయవద్దని ముఖ్యంగా కాల్వల్లో వ్యర్థాలు పడవేయవద్దని సూచించారు. చెత్త సేకరణకు ఇంటికి వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త ఇవ్వాలని కోరారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల వితరణ అందిపుచ్చుకోవాలి



కొల్లిపర: దాతల వితరణ అందిపుచ్చుకోవాలని మున్నంగి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.లక్ష్మీ కమల, ఎం ధనలక్ష్మీ అన్నా రు. దుగ్గిరాలకి చెందిన చుండూరు భాస్కరరావు మున్నంగిలోని రెగ్యులర్, ఎల్. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యాభిషేక సామగ్రి అందజేశారు. భాస్కరరావు దాతృత్వాన్ని ఉపాధ్యాయులు అభినందించారు. షేక్ వహీదా, వెంకాయమ్మ, సత్తార్ తదితరులున్నారు.

బీసీ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి

తెనాలి: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల విద్యార్థులు, ఉద్యోగులు ప్రధాన సమస్యలను పరిష్కరించాలంటూ, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు నేతృత్వంలోని బృందం శుక్రవారం సీఎం కార్యాలయ కార్యదర్శికి విజ్ఞాపన అందించారు. అనంతరం విడుదల చేసిన ప్రకటనలో, బీసీ హాస్టళ్ల విద్యార్థుల కోసం కేటాయిస్తున్న డైట్-కాస్మోటిక్ చార్జీలు పక్క రాష్ట్రాలతో గాని, మార్కెట్ ధరలతో పోల్చితే చాలా తక్కువగా ఉన్నాయన్నారు. దీనివల్ల హాస్టళ్ల విద్యార్థులు-ఉద్యోగులు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. హాస్టళ్ల సంక్షేమాధికారులపై ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ కేసులను సత్వరమే ఆరు నెలల లోపల పరిష్కరించాలన్నారు.

‘సార్క్’ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన యువతికి సాయం



ఆర్థికసాయం చెక్కును అందిస్తున్న డీఎల్ కాంతారావు

తెనాలి: నేపాల్ రాజధాని ఖాట్మండులో గల ‘సార్క్’ సెక్రటేరియట్‌లో రెండు నెలల ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన తెనాలికి చెందిన ఐఐటీ, మద్రాస్ విద్యార్థిని పి.స్నేహితకు స్థానిక ‘పోస్ట్’ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. లక్ష ఆర్థికసాయాన్ని అందించారు. ఇక్కడి కొత్తపేటలోని కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు చేతులమీదుగా స్నేహిత తండ్రి నరసింహా రావుకు చెక్కును అందజేశారు. విద్య, ఉపాధి, మహిళా సాధికారత, వైద్యసేవలు, వృద్ధాశ్రమం, గోశాల నిర్వహణలో రెండు దశాబ్దాలుగా పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ కృషిచేస్తోంది. స్థానిక హెడ్ పోస్టాఫీసులో పనిచేస్తున్న పి.నరసింహారావు కుమార్తె స్నేహిత ఐఐటీ, మద్రాస్‌లో ఎంఏ డెవలప్‌మెంట్‌లో నాలుగో ఏడాది చదువుతోంది. ఆమెకు ‘సార్క్’ సెక్రటేరియట్‌లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం లభించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 30 మందిలో స్నేహిత ఒకరు. సార్క్ నుంచి ఎలాంటి స్టైఫండ్ వచ్చే అవకాశం లేనందున కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావును సంప్రదించారు. ఆయన స్పందించి రూ.లక్షను ‘పోస్ట్’ ట్రస్ట్ ఖాతాకు రూ.లక్షను జమ చేశారు. ఆ మొత్తానికి చెక్కును పోస్ట్ ట్రస్ట్ తరపున స్నేహిత తండ్రి నరసింహారావుకు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో సామాన్యుడికి ఆర్థిక భారం

సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బాబుప్రసాద్

తెనాలిటౌన్: విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడంతో సామాన్యులకు ఆర్థిక షాక్ తగులుతుందని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పేదల ఇళ్లకు బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ప్రజలపై మోపుతున్న ఇంటి పన్నుల భారాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ పాల్గొని ప్రజలకు కరపత్రాలు అందజేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు భవిష్యత్‌లో మనపాలిట శాపాలుగా మారుతాయని ఆరోపించారు. ఉపాధి లేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే సాంకేతికత పేరుతో కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు బిగిస్తుందని మండిపడ్డారు. కష్టాల నుంచి ప్రజలను గట్టెంకించాల్సిన ప్రభుత్వం ఆస్తి అదారిత పన్ను వసూలు చేయడం సరైన విధానం కాదని విమర్శించారు. రాజకీయ విలువలు పాటించకపోతే రాబోయే రోజుల్లో ప్రజా ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికాకతప్పదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలీ, ఎన్.రాజ్యలక్ష్మి ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



తెనాలిటౌన్: మండల పరిషత్ ఉద్యోగుల సేవార్ధం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పటల్ తెనాలి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, విద్యాశాఖ కార్యాలయం, వెలుగు కార్యాలయ పరిధిలోని ఉద్యోగులు ఈ శిబిరంలో పాల్గొన్ని వైద్య సేవలు పొందారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగులు సేవార్థం అగర్వాల్స్ ఐ హాస్పటల్ యాజమాన్యం వైద్య శిబిరం నిర్వహించడం ముదావహమని సేవలను కొనియాడారు. ఉద్యోగులకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌ఛార్జి ఎస్‌కె నాగూర్‌వలి, ఎంఈవో ఎం.లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్సు దొరికితే పోలీసులకు అప్పజెప్పిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

తెనాలిరూరల్: రోడ్డుపై పడి ఉన్న పర్సును సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పోలీసులకు అప్పగించాడు. మండలంలోని చావావారిపాలెంకు చెందిన చిక్కాల తరుణ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల వర్క్ ఫ్రం హోం కింద స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై తెనాలి వచ్చిన అతను రైల్వే స్టేషన్ రోడ్డులోని పెట్రోలు బంకులో పెట్రోల్ కొట్టించుకుని దాని ఎదురు రోడ్డులోకి వెళ్లగా రోడ్డుపై పర్సు పడి ఉండడాన్ని గమనించాడు. పర్సులో నగదు, ఏటీఎం కార్డులు, ఆధార్ కార్డు ఉంది. చుట్టపక్కల వాళ్లను వాకబు చేసిన ఎవరి పర్సు పోలేదని చెప్పగా, వెంటనే సమాచారాన్ని తెనాలి ట్రాఫిక్ విభాగంతో హోంగార్డుగా పని చేస్తున్న తన తండ్రి సింగ్‌కు తెలిపాడు. ఆయన సూచన మేరకు ఇరువురూ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ నక్కా ప్రకాశరావుకు పర్సును అందజేశారు. నిజాయితీగా పర్సును అందజేసిన తరుణ్‌ను ఎస్‌ఐ, త్రీ టౌన్ సిబ్బంది అభినందించారు.

నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

తెనాలిటౌన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నేడు ఉదయం 9 గంటలకు స్థానిక చెంచుపేటలోని గవర్నమెంట్ హాస్పటల్ బ్లడ్ బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సత్యం శివం సుందరం సామాజిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తన్నీరు శివశంకర్ చెప్పారు. రక్తదాతలు పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ జి.రాధాభాయ్ శిబిరంలో సేవలందిస్తారని తెలిపారు.